క్లుప్తంగా

పౌర సరఫరాల గోదాము తనిఖీ



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్ : పట్టణంలోని పౌరసరఫరాల గోదామును సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బియ్యం పంపిణీలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రేషన్ అందేలా చూడాలన్నారు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ వలీబాషా పాల్గొన్నారు.

బసవేశ్వరుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: స్థానిక బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి సోమవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి వేకువ జాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు పట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రస్తా విషయంలో ఘర్షణ



గాయపడిన సవారప్ప నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆదోని అర్బన్ : మండలంలోని కపటి గ్రామంలో పొలం రస్తా విషయంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య సోమవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువర్గాలు ఇస్వీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. పొలం రస్తా విషయంలో వైఎస్సార్‌సీపీకి చెందిన సవారప్ప, టీడీపీకి చెందిన పాండు, తుకారామ్, లక్ష్మి మధ్య మాటామాట పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. గాయపడిన వారికి స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పాండు వర్గీయులపై ఎస్సీ, ఎస్టీ కేసు, సవారప్ప వర్గీయులపై దాడి కేసు నమోదు చేశామని ఇస్వీ పోలీసులు తెలిపారు.

కంపెనీపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్ : పట్టణంలోని 5 స్టార్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున, జిల్లా అధ్యక్షుడు రాజు కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆదోనిలో పేద ప్రజలే లక్ష్యంగా ఫైనాన్స్ కంపెనీలు ఇష్టానుసారంగా ప్రాసెసింగ్ ఫీజుతో వేలాది రూపాయలను దండుకుంటున్నాయని చెప్పారు. 5 స్టార్ కంపెనీలోనూ రూ.2 వేలు ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని, వివిధ కారణాలు చూపుతూ లోన్ రాదని చెప్పి పంపుతున్నారని, అలాగే వారు కట్టిన మొత్తాన్ని వెనక్కి ఇవ్వడం లేదని వివరించారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, డివిజన్ కార్యదర్శి శివ, అధ్యక్షుడు విజయ్, యల్లప్ప పాల్గొన్నారు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

పెద్దకడబూరు: మండలంలో పెండింగ్‌లో ఉన్న హౌసింగ్, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, మనబడి నాడు – నేడు కింద చేపట్టిన పాఠశాలల్లో నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ నిర్మాణాలపై ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శిలతో సోమవారం సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు'..

ఆదోనిరూరల్ : మండలంలోని మదిర గ్రామంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి సోమవారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రజా సమస్యలను తెలుసుకుని, సంక్షేమ పథకాలను తెలియజేస్తారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

మోస్తరు వర్షం

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం, మంత్రాలయం, చెట్నేహళ్లి, సూగూరు, బూదూరు, రచ్చుమర్రి, రాంపురం తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. రాత్రి వరకు వాన కురవడంతో విత్తనాలు వేసిన రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆశా వర్కర్లను గుర్తించండి

కౌతాళం: ఆశ వర్కర్లను గుర్తించాలని, వారితో సంబంధం లేని పనులు చేయించరాదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న కోరారు. సోమవారం ఆశా వర్కర్లతో మండల వైద్యాధికారి పావనికి వినతి పత్రం అందజేశారు.అలాగే బదినేహాల్ పీహెచ్‌సీ, ఆరోగ్య ఉపకేంద్రాల్లో కూడా నిరసన తెలిపి వినతి పత్రాలు అందజేశారు.

టోఫెల్‌తో భాషా సామర్థ్యం మెరుగు

సర్కారు బడుల్లోని విద్యార్థులు కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు ఇంగ్లిష్ భాషపై పట్టుండాలని భావించి టోఫెల్ పరీక్షల్లో విద్యార్థులకు ఇప్పటి నుంచే శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణులను చేయాలని నిర్ణయిచింది. టోఫెల్ పరీక్షకు సంబంధించి 6–9వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ భాషలో పట్టుసాధించేందుకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. విద్యార్థి పఠన, గ్రాహక శక్తి, వినడం, మాట్లాడటం, రాయడం వంటి వాటిపై ఇంటర్‌నెట్ ద్వారా మ్యాప్ చేస్తారు. వీటిన్నింటినీ ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని విద్యాశాఖను ఆదేశించింది.

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు టోఫెల్ పరీక్షలు
- మంగళ, గురు, శనివారాల్లో ప్రత్యేక శిక్షణ
- ఆన్‌లైన్‌లోనే ప్రశ్నలకు జవాబులు
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు



తరగతిగదిలో విద్యార్థులు

ఆదోని సెంట్రల్: విద్యార్థుల్లో భాషా సామర్థ్యాన్ని పెంపొందించడానికి టోఫెల్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయి. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు టోఫెల్ జూనియర్ పరీక్షలను నిర్వహిస్తారు. ఆంగ్ల భాషా నైపుణ్యం కోసం ఈ పరీక్షలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు జూనియర్ సమగ్ర పరీక్షలో పఠన, గ్రాహణ శక్తి, వినడం, మాట్లడటం, రాయడం వంటి స్కోర్‌లు ఇంటర్‌నెట్ ద్వారా మ్యాప్ చేస్తారు. పరీక్షలో వారు సాధించిన స్కోర్‌ను బట్టి సర్టిఫికెట్లు అందజేస్తారు.

పరీక్ష విధానం

ఫార్మెటివ్ అసిస్‌మెంట్–1 కి సంబంధించిన టోఫెల్ పరీక్షలకు విద్యార్థులను ప్రతి మంగళ,గురు,శనివారాల్లో ప్రాక్టీస్ చేయించాలి. మోడల్ పేపర్స్ స్మార్ట్ టీవీ లేదా ఐఎఫ్‌పీలో మొబైల్ డివైస్ మెనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఆడియో క్లిప్ పోస్ట్ చేస్తారు. ఈ ఆడియో క్లిప్ సంబంధిత హెచ్‌ఎం ఓటీపీ ద్వారా ఓపెన్ చేసి విద్యార్థులకు చూపించాలి. విద్యార్థులు ఆ వీడియోలో ఉన్న కథను విని అర్థం చేసుకోవాలి. టోఫెల్ ద్వారా వచ్చిన ప్రశ్నలకు ఆన్‌లైన్‌లోనే పరీక్షలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇంగ్లిష్ పేపర్ పార్ట్–బిని కూడా అలాగే నిర్వహిస్తారు.

షెడ్యూల్ ప్రకారం..

విద్య అకాడమిక్ క్యాలెండర్‌ను బట్టి టోఫెల్ ఇన్‌స్ట్రక్షన్ తరగతులకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు. రోజు మార్చి రోజు ప్రాక్టీస్ షీట్స్, ఐటీ వింగ్ ద్వారా అందించే ఆడియో క్లిప్పింగ్ ద్వారా పిల్లలతో ప్రాక్టీస్ చేయించాల్సి ఉంటుంది.

ఎంతగానో ఉపయోగపడుతుంది



టోఫెల్ పరీక్షలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయి. భాష పరిజ్ఞానంతో పాటు విద్యార్థులకు భాషపై అవగాహన కల్పించిన వారవుతాము. భాషపై పట్టు సాధించడం వల్ల భవిషత్‌లో ఎక్కడైనా రాణించగలరు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో విదేశీ విద్యపై ప్రామాణికతను తెలుసుకోవాడానికి ఉపయోగించే టోఫెల్ పరీక్షలను మన పిల్లలు నేర్చుకునేలా పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉంది. – అలిమ్ సిద్ధిఖీ, హెచ్‌ఎం, నెహ్రూమెమోరియల్ పాఠశాల, ఆదోని

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గోవింద్‌సింగ్, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, బీసీ వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని....

- హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో సర్వే నంబర్ 112/బీలో 1.67 ఎకరాల భూమి పెద్దల నుంచి తనకు సంక్రమించిందని, ప్రస్తుతం ఆ భూమికి సంబంధించి అడంగళ్‌లో వేరే వారి పేరు నమోదై ఉందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీదారుడు దరఖాస్తు చేసుకున్నాడు.
- హొళగుంద మండలం కోగిలతోట గ్రామానికి చెందిన వీరభద్రకు సర్వే నంబర్ 111/ఈలో 2.19 ఎకరాల భూమి ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్ అడంగళ్‌లో వేరే వారి పేరిట ఉందని, వాటిని తొలగించి తన పేరున నమోదు చేయాలని అర్జీ అందజేశాడు.
- ఆదోని పట్టణం రాయనగర్‌కు చెందిన సామేల్ భార్య దానమ్మ పేరిట కోసిగి మండలం బోంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 328/8పైకి 2 ఎకరాల భూమి ఉందని, పట్టాదారు పాసు పుస్తకం ఆమె పేరు మీద ఉందని, పొలం సర్వే చేసి హద్దులు చూపాలని కోరారు.
- కౌతాళం మండలం వీర్లదిన్నె గ్రామానికి చెందిన హరిజన నరసప్పకు సర్వే నంబర్ 60/ఏలో 1.18 ఎకరాల్లో గత 70 సంవత్సరాలుగా అనుభవంలో ఉన్నామని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు మీద నమోదై ఉందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ ఇచ్చారు.

స్పందనతోనే సమస్యల పరిష్కారం

ఆదోనిటౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్పందన కార్యక్రమం చేపట్టారని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అన్ని సెక్షన్ల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 17వ వార్డు కార్వన్‌పేట, కరీందివాన్‌దర్గా ఏరియాలో రోడ్లు, మురుగు కాలువలు, పైపులైన్లు, తాగునీటి వసతిని కల్పించాలని వీరేష్‌తో పాటు మరో ఇద్దరు, బావూజీపేటకు చెందిన నాగవేణి టిడ్కో ఇళ్లను కేటాయించాలని, శివారు ప్రాంతాలకు సమయానుకూలంగా నీటిని సమయాలకు వదలడంలేదని రామాంజనేయులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన సతీమణి కాచాపురం గ్రామ సర్పంచ్ జయమ్మ పాల్గొని గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలు, ప్రభుత్వం అమలు చేసి పంక్షేమ పథకాలు అందిన తీరును అడిగి తెలుసుకుంటారన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

నేడు 'జగనన్న సురక్ష'

మండలంలోని అగసనూరు గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యాక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హాజరై దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువ పత్రాలు అందజేస్తారని చెప్పారు.

బీమా తక్షణ సాయం అందజేత

కౌతాళం: మండల కేంద్రానికి చెందిన చాకలి పెద్ద హుసేని ఈనెల 14న అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు వైఎస్సాఆర్ బీమాకు అర్హత పొందటంతో తక్షణ సాయం కింద రూ.10వేలను నామిని ఆయన భార్య లక్ష్మికి సర్పంచ్ పాల్‌దినకర్ సోమవారం అందజేశారు. సంక్షేమ సహాయకురాలు మణి, వలంటీర్ సునీత ఉన్నారు.

మద్యం విక్రేతకు రిమాండ్

మంత్రాలయం రూరల్: మండలంలోని చిలకడోణ గ్రామానికి చెందిన బోయ ఈరన్న కర్ణాటక మద్యం 48 (90 యంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తుండగా సోమవారం పట్టుకున్నట్లు ఎస్ఐ యూ.వేణుగోపాల్‌రాజు తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు.

నదిలో చేపల వేటకు వెళ్లి మృతి

మంత్రాలయం రూరల్: మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన బెస్త మల్లేష్ (45) చేపల వేటకు వెళ్లి మృతి చెందిన ఘటన కర్ణాటక సరిహద్దు ఇడుపునూరు పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్లేష్ కర్ణాటక సరిహద్దు తుంగభద్ర నదిలో మర పడవతో నిత్యం చేపల వేట సాగించేవాడు. ఈ క్రమంలో చేపలను పట్టేందుకు వలవేసే సమయంలో ప్రమాద వశాత్తు నదిలో మునిగి మృతి చెందాడు. ఇడుపునూరు పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


కళాత్మక వృత్తిలో అపురూపమైనది చేనేత



మాట్లాడుతున్న ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ

ఆదోని సెంట్రల్: కళాత్మక వృత్తిలో అపురూపమైనది చేనేత, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ, అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అక్షరశ్రీ పాఠశాలలో కలం ప్రష్లోడ్ అధ్యక్షతన చేనేత జీవితాలపై సాహిత్య సదస్సు నిర్వహించారు. మేఘనాథరెడ్డి తెలుగు తల్లికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో వారు మాట్లాడుతూ లోకా మల్లరిగారు రాసిన 'సంఘం' నవలలో కులం కట్టుబాట్లు దానికి బలయ్యే చేనేత కార్మికుల జీవితాలను చక్కగా వర్ణించారని గుర్తు చేశారు. విజయలక్ష్మి రాసిన 'చిలకంచు జరీ కోక' అనే నవల చేనత రంగం నిర్లక్ష్యానికి గురి కాకుండా వారిని ప్రోత్సహించేలా చూపిందని ప్రముఖ రచయిత డా.ఎం.హరికిషన్ తెలిపారు. కవి రచయిత జంధ్యాల రఘుబాబు,పోరంకి దక్షిణామూర్తి 'ముత్యాల పందిరి' అనే నవల ద్వారా చేనేతల దర్భర జీవితాలను వివరించారన్నారు. కవి సుమ భూపాల్ 'అగ్గిపెట్టిలో ఆరు గజాలా చీర' నవలను విశ్లేషిస్తూ చేనేతలకు నూతన యంత్ర సామగ్రి అందించాలని పేర్కొన్నారు. సాహితీ స్రవంతి జిల్లా ప్రధానకార్యదర్శి అవుల బసప్ప, అరసం జిల్లా ఉపాధ్యాక్షులు పుల్లా రామాంజనేయులు, కేసి మల్లికార్జునలతో పాటు 25 మంది కవులతో సమ్మేళనం జరిగింది. చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు రామచంద్రను సన్మానించారు. సవ్వప్పగారి ఈరన్న, పద్యకవి ఈశ్వరప్ప, సుధాకర్ బాబు, జంగం స్వయం ప్రభ, నాగన్న ప్రేమ్ కుమార్, ఎఎస్ఓ వెంకటేశ్, లీల మనోహార్, నల్లా రెడ్డి, సత్య, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

స్పందనలో ఎంఈఓ కునికిపాట్లు



మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దేవ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ–2 రాఘన్న అధికారుల మధ్య కుర్చీలో కునుకుతీశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలిస్తుంటారని, అయినా ఆయన కునుకు తీయడాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి..

కోసిగి: మండల కేంద్రం నుంచి చింతకుంట, పల్లెపాడు గ్రామాల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి రాముడు, రామకోట్టి, హనుమంతు కోరారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో చింతకుంట గ్రామ సచివాలయంలో వీఆర్వో సాయిని కలిసి వినతి పత్రం అందించారు. అలాగే బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు.

ఘనంగా న్యాయ దినోత్సవం

ఆదోనిఅర్బన్ : ఆవోపా, అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య హాస్టల్‌లో సోమవారం అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్‌గుప్తా, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు బూదూరు సంగీత, వంకదారు మమతాశ్రీ ఆధ్వర్యంలో అడ్వకేట్ రవీంద్ర, మహిళా అడ్వేకేట్లు అనిత, సబితారాణి, టీజీ బాలత్రివేణి, శ్రీలలిత, సత్యశ్రీ, శ్రీలావణ్య తదితరులను సన్మానించారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మించాలి..

ఆదోనిరూరల్ : పట్టణంలో మంచినీటి సమస్య పరిష్కారానికి అదనంగా మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శిగ్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, వీరేష్, నాగరాజు, అజీమ్‌ఖాన్, ఇక్బాల్ సోమవారం కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్ : పాండవగల్లు, ఢణాపురం, మాంత్రికి, బసరకోడు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించి. అధికారులకు వినతి పత్రం అందజేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఆదోని రూరల్ : మండలంలోని బసాపురం ఎల్లెల్సీ పంప్‌హౌస్ వద్ద సోమవారం కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు. ఆదోని పట్టణానికి చెందిన జి.కె.మునిస్వామి, రాజ్‌కుమార్ కర్ణాటక రాష్ట్రం నాగరహాల్ నుంచి బైక్‌పై తీసుకొస్తుండగా 437 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సమస్యలను పరిష్కరించండి

పెద్దకడబూరు : మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గసభ్యుడు పరమేష్ కోరారు. మండల కేంద్రంలోని సచివాలయం – 1 ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించాలని, ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

మా డబ్బులు ఇప్పించండి

ఆదోనిఅర్బన్ : స్థానిక జీవనజ్యోతి ఆశ్రమ నిర్వాహకుడు ఫిలిప్స్ తమ నుంచి రూ.లక్ష నగదును తీసుకొని, ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని, చర్యలు తీసుకొని మా డబ్బులు ఇప్పించాలని హనుమంతరావు అనే వృద్ధుడు సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో సమస్యను విన్నవించారు. తన భార్య, కుమారులతో గొడవపడి ఆదోనిలోని జీవనజ్యోతి ఆశ్రమంలో చేరేందుకు ఫిలిప్స్‌ని కలవగా రూ.లక్ష ఇవ్వండి ఆశ్రమంలోని ఓ షెడ్‌ను ఖాళీ చేసి ఇస్తానని చెప్పాడు. అందుకు తాను ఆ మొత్తం అందజేశానని, ఆ తర్వాత ప్రతినెలా పింఛన్ డబ్బులు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. ఆయన వేదింపులు తాళలేక బయటకు వచ్చేశామని, తొలుత ఇచ్చిన రూ.లక్ష ఇవ్వాలని కోరితే పట్టించుకోకపోగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయాడు. విచారించి న్యాయం చేస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఆపదలో అండగా..

వలంటీర్లకు వందనం



గుంటూరులో డయాలసిస్ బాధితుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నర్సారెడ్డి

ఈ ఫొటోలో పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి పేరు గుర్రాల మునిస్వామి. కోసిగిలోని నాగన్న కాలనీలో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. బతుకుదెరువు కోసం ఏటా గుంటూరుకు వెళ్తుంటారు. మునిస్వామి గతేడాది నుంచి మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ గుంటూరులోని ఓ ఆసుపత్రిలో వైద్య చికిత్స చేయించుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఆర్థిక సాయం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ప్రభుత్వం నెలకు రూ.10వేల పింఛన్ డయాలసిస్ కోసం మంజూరు చేసింది. ఐదు నెలల క్రితం వ్యాధి తీవ్రం కావడంతో సొంతూరికి రాలేకపోయారు. అయితే విషయం తెలుసుకున్న వలంటీర్ నర్సారెడ్డి అక్కడికి వెళ్లి ఆయనకు పింఛన్ సొమ్ము అందజేశాడు. – కోసిగి



ఆర్థిక ఇబ్బందులు తప్పాయి

డయాలసిస్ కారణంగా గుంటూరులోనే ఉంటూ నడవలేని స్థితిలో ఉండగా, చేతిలో చిల్ల గవ్వ లేదు. వైద్య చికిత్స కోసం ఎవరిని అడగాలో తెలియక ఆందోళన చెందుతున్న సమయంలో మా వలంటీర్ నర్సారెడ్డి గుంటూరుకు వచ్చి పింఛన్ సొమ్ము అందజేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడ్డాం. ఇలా ఆయన నాకు పలుమార్లు అలా వచ్చి పింఛన్ ఇచ్చాడు. ఆయనకు కృతజ్ఞతలు తెలపడం చాలా చిన్నది. – మునిస్వామి

తాగునీటికి కొరత లేదు

- 30 రోజులకు సరిపడే నీరు నిల్వ



బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో నిల్వ ఉన్న నీరు

ఆదోని టౌన్ : వర్షాభావ పరిస్థితుల కారణంగా తుంగభద్ర దిగువ కాలువకు రావాల్సిన తాగు, సాగునీరు ఆలస్యమవుతోంది. దీంతో నీటి సమస్య తలెత్తుతుందని ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణ ప్రజలకు నీటి వృథాపై మున్సిపల్ అధికారులు పరిస్థితిని వివరిస్తూనే అవగాహన కల్పిస్తున్నారు. అయితే ప్రస్తుతం బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో 25–30 రోజులకు సరిపడ నీరు నిల్వ ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఏఈ రాజశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ప్రస్తుతం రాంజల చెరువులో 780 ఎంఎల్‌డీ నీరు నిల్వ ఉందని, ఆ నీరు 25–30 రోజులకు సరిపోతాయని చెప్పారు. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో 34 వేల కనెక్షన్లు, 160 మినీ వాటర్ స్కీంలు, 150 చేతిపంపులు ఉన్నాయి. కుళాయిల ద్వారా రోజుకి 26 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ లెక్కన దాదాపు నెలరోజులకు సరిపడ నీరు నిల్వ ఉంది. ఇటీవల కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. కెనాల్‌కు నీరు వచ్చిన వెంటనే రాంజల నల్లచెరువును పూర్తి స్థాయిలో నింపుతామని చెప్పారు.

ఆధ్యాత్మికం

ఘనంగా అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో చంద్రమౌలేశ్వరస్వామి

ఆదోని అర్బన్ : పట్టణంలో వెలిసిన శైవ, వైష్ణవ ఆలయాల్లో సోమవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ శివారులోని కోటనగర్‌లో వెలిసిన శ్రీకోట చంద్రమౌలేశ్వరస్వా మి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, నైవేద్యం, మహామంగళహారతి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే మాధవరం రోడ్డు లో వెలిసిన శ్రీ శనీశ్వరస్వామి ఆలయంలో, మట్కా రిగేలో వెలిసిన ఉరుకుంద ఈరన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

కౌతాళం: స్థానిక ఖాదర్‌లింగ స్వామి దర్గాలో సోమవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల చేశారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు



బారులు తీరిన భక్తులు

ఘనంగా చౌడేశ్వరిదేవి జయంతి

పెద్దకడబూరు : మండల కేంద్రంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను తొగటవీరక్షత్రియ వంశస్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి అభిషేకాలు, ఆకు పూజలు, మహా మంగళహారతులు చేపట్టారు. భక్తులు చేపట్టిన భజనలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన ఆలయంలో చౌడేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారి ఉత్సమూర్తిని గ్రామంలో ఊరేగించారు.

శ్రీమఠంలో భక్తుల సందడి



శ్రీమఠం కారిడార్‌లో భక్తజన సందోహం

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం అమావాస్య సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా తరలి రావడంతో శ్రీమఠం ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. రాఘవేంద్రుల మూలబృందావన దర్శనానికి గంట సమయం పట్టింది. మంచాలమ్మ దర్శన, పరిమళ ప్రసాదం, అన్నపూర్ణ భోజనశాల క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. ముందుగా గ్రామ దేవతకు మొక్కులు తీర్చుకుని భక్తులు రాఘవేంద్రుల మూల బృందావన దర్శనం చేసుకున్నారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు చేపట్టిన మూల రాముల సంస్థాన పూజలు సేవా భక్తులను ఆకట్టుకున్నాయి.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



వెండి అలంకరణలో స్వామి వారు



దేవాలయం వద్ద భక్తుల సందడి

కౌతాళం: అమావాస్య సందర్భంగా ఉరుకుంద క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.స్వామి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులను విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ దర్శనాల ద్వారా దర్శనానికి పంపారు.కొందరు క్షేత్ర ఆవరణలో పిండివంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, బళ్లారి డిపోలు ప్రత్యేక బస్సులను నడిపాయి.

రామలింగేశ్వర స్వామి దేవాలయంలో

మేళిగనూరులో తుంగభద్ర నది ఒడ్డున వేలసిన రామలింగేశ్వర దేవాలయం సోమవారం భక్తులతో పులకించింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సోమవారం అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరస్వామి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుళేకేరి గ్రామ శివారుల్లో వెలిసిన బుడుములదొడ్డి, ఏరిగేరిలోని పులిగట్టుఆంజనేయస్వామి దేవాలయాలకు భారీగా వచ్చి పూజలు చేశారు.